# స్కూల్ డే

అందరికీ వంకలు పెట్టే ఆకతాయికి సరైన గుణపాఠం !



మదన్ : అబ్బ ! ఈ చీఫ్‌గెస్ట్ రావడమే రెండు గంటల్లేటు ! ఇప్పుడు అరగంట నుండి స్పీచ్ దంచేస్తున్నాడు ! ఈయన స్పీచ్ వినే ఓపిక ఎవరికుంటుంది ?

రాజా : మనలాంటి స్టూడెంట్స్ వచ్చేదే ఈ డ్రామాలూ, డ్యాన్సులూ చూడటానికి ! ఈ ఉపన్యాసాలు ఎవడిగ్గావాలీ ?

(ఉపన్యాసం భరించలేనట్టుగా... స్టూడెంట్స్ రకరకాల పోజులతో విసుగ్గా వుంటారు.. అర క్షణం గడిచాక....)

సోమూ : ఒరేయ్... ఈలలూ... విజిల్స్‌తో చీఫ్‌గెస్ట్‌ని హడలగొడ్దామా ?

వెంకట్ : రెడీ.... వన్... టూ.... త్రీ !

(స్టూడెంట్స్ ఈలలతో గోలచేస్తారు)

మదన్ : (నీరసంగా) ఇంకా చీఫ్‌గెస్ట్ దిగిపోవడం లేదేమిట్రా ?

రాజూ : ఈయనెవరో గట్టి పిండంలా వున్నాడు ! ఇంకాస్త అల్లరి చేద్దామా?

సోమూ : చేద్దాం ! చేద్దాం !

మదన్, రాజూ, సోమూ, వెంకట్ : ఓ...ఓ...ఓ...! ఓ...ఓ...ఓ..!

(అలా 'ఓ' రాగాన్ని అర నిమిషం పొడగిస్తారు ! అది కూడా పనిచేయకపోవడంతో కంటిన్యుయస్‌గా ఆగకుండా చప్పట్లు కొడతారు)

మదన్ : (స్టేజీ వంక చూసి, ఉన్నట్టుండి.... సంతోషంగా) అమ్మయ్య ! దిగిపోతున్నాడ్రా చీఫ్‌గెస్ట్ !

(కాసేపు నిశ్శబ్దం ! ప్రేక్షకులంతా స్టేజివంక దీక్షగా చూస్తూ వుంటారు. ఉన్నట్టుండి తెర వెనుకనుండి... చిన్న అనౌన్స్‌మెంట్)

"ప్రేక్షక మహాశయులకి నమస్కారం ! ఒక అయిదు నిమిషాల్లో కల్చరల్ ప్రోగ్రాం మొదలౌతుంది !"

మదన్ : అరేయ్.... అరేయ్.... కల్చరల్ ప్రోగ్రాం స్టార్ట్ కాబోతోందిరా !

(సంతోషంతో ఒకర్నొకరు కొట్టుకుంటూ - వీపులు చరుచు కుంటూ - కుర్చీలపై మోతలు మోగిస్తూ వుంటారు)

సోమూ : (కళ్ళప్పగించి చూస్తూ) ఆ అమ్మాయి డాన్స్ ఫర్వాలేదు కదూ !

వెంకట్ : పోన్లే పాపం ! చప్పట్లు కొడ్దాం ! పొంగిపోతుంది! తనేదో బాగా చేసిందనుకుని మురిసిపోతుంది !

(తెరవెనుక నుండి అనౌన్స్‌మెంట్: " ఇప్పుడు ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ ! చిన్నపిల్లల డ్యాన్స్)

మదన్ : ఒరేయ్... స్టేజీపైకి ఇంకో పాప వచ్చింది. యల్కేజీ పాప కాబోలు! ముద్దుగా... బొద్దుగా వుంది ! ఏం పెట్టి పోషిస్తున్నారోగానీ !

రాజూ : అబ్బ ! ఆ పాప అంత లావుగా వుంది - కదా ! ఆ పాప డాన్స్ చేస్తుందంటావా ?

సోమూ : అదిగో - అలా అన్నావో లేదో... పాపం, బెదిరి వెనక్కి పోతోందిరా!

వెంకట్ : తెర పక్కన - ఆ చేతులు ఎవరివీ ?

మదన్ : వాళ్ళ టీచర్‌విరా ! ఆ పాపని స్టేజీ మీదికి తోస్తోంది!

రాజూ : అసలేే ఆ పాప బెదిరిపోతూంటే ఈ టీచర్ హడావిడేమిట్రా ?

సోమూ : చూడబోతే... ఆ పాప బదులు... ఈవిడగారిని డాన్స్ చేయదు కదా !

(మళ్ళీ అనౌన్స్‌మెంట్ : "నౌ ఇంగ్లీష్ ప్లేలెట్ !")

మదన్ : అబ్బ ! ఇంగ్లీష్ నాటిక ! ఇదో బోర్ ! ఈ ఇంగ్లీష్‌మీడియం వాళ్ళకేం పనివుండదు !

రాజా : అసలిది ఎవరికి అర్థమవుతుంది ? 'పే...ద్ద' వాళ్ళకే ఇంగ్లీష్ వచ్చిని పోజులు కాకపోతే!

సోమూ : ఒరేయ్.... నాదో అనుమానం ! ఇంతకీ ఈ ఇంగ్లీష్ డైలాగ్స్ ఈ పిల్లలవేనా ? లేక వెనుక నుండి ఎవరైనా మాట్లాడుతున్నారా ?

వెంకట్ : అరేయ్... ఈ ఇంగ్లీష్ డ్రామాలప్పుడు మనం కాస్త కునుకుతీయ వచ్చు! ఏమంటార్రా ?

రాజూ, సోమూ: (బుర్రలూపుతూ) అంతే.. అంతే!

(కుర్చీలపై రిలాక్స్‌డ్‌గా కొందరూ, చూడటం ఇష్టంలేనట్టుగా మరికొందరూ చేరగిలపడ్తారు! అంతలో తెర వెనుకనుండి మళ్ళీ అనౌన్స్‌మెంట్: "ఇక కొద్ది నిమిషాల్లో డిస్కో... డాన్స్!")

మదన్ : (చెంగున కుర్చీపైకి గెంతి) అదిగో ! డిస్కో డాన్సుట్రా!

రాజూ, సోమూ, వెంకట్ : (ఒక్కుదుటున లేచి) అవునా !?

(విజిల్స్ వేసి - ఎగిరి గంతేస్తారు ! రాజూ కుర్చీ ఎక్కి నోరప్ప గించి చూస్తూ వుంటాడు ! సోమూ మునివేళ్ళపై ఎగిరెగిరి, కళ్ళప్పగించి చూస్తూ వుంటాడు ! వెంకట్ ఆ ఇద్దరి తలల్నీ ఎడం చేస్తూ - వాళ్ళ తలల మధ్య నుండి చూస్తూ వుంటాడు)

మదన్ : డిస్కో డాన్స్ బ్రహ్మాండంగా వుందిరా !

రాజూ : డ్రెస్ కన్నా లైటింగ్ బ్రహ్మాండంగా వుందిరా!

సోమూ : లైటింగ్ కన్నా స్టెప్స్ అమోఘంరా !

వెంకట్ : స్టెప్స్‌కన్నా పాట బావుందిరా !

(ఇంతలో 'సతీష్' అనే మరో స్టూడెంట్ అక్కడికి వచ్చి - వాళ్ళ కి స్టేజీ కన్పించకుండా అడ్డంగా నిలబడి ప్రోగ్రాం చూస్తూ వుం టాడు!)

మదన్ : (సతీష్‌ని చూసి) హలో సత్తిగా ! నువ్వూ వొచ్చావ్ - ఈ స్కూల్‌డే కల్చరల్ ప్రోగ్రాంకి ? నీకెన్ని సార్లు చెప్పాలా ? ఎక్కడికైనా వెళ్ళేముందు కడుపు నిండా మెక్కిరావొద్దనీ ! దూరం నాయనా దూరం ! నీ బొజ్జ తగిలి నాలాంటి బక్క ప్రాణాలు కింద పడగ లవు!

(తెర వెనుకనుండి మళ్ళీ అనౌన్స్‌మెంట్: "ఇప్పుడు పికాక్ డాన్స్")

వెంకట్ : ఒరేయ్ సోమూ, అరేయ్ రాజూ.... సత్తిగా- అటు చూడండ్రా ! నెమిలిడాన్స్ ఎంత బావుందో!? ఆ మ్యూజిక్.... సింప్లీ సూపర్బ్! ఇంతకీ నెమిలిగా వేసింది ఎవరై వుంటారంటావ్? ఆ టెంత్ క్లాస్ పద్మజై వుంటుంది కదూ ! అబ్బే - కాదులావుంది ! బహుశ: ఆ రెండు జళ్ళ చంద్రకాంతై వుంటుంది!

సోమూ : కాదురా ! ఈ అమ్మాయెవరో ఈ స్కూల్‌కి కొత్త గా వచ్చినట్టుంది!

మదన్ : ఒరేయ్ సత్తిగా ! ఇలా రారా !

(సతీష్ దగ్గరికి వస్తాడు. అతడి బొజ్జ నిముర్తూ)

మదన్ : ఒరేయ్, ఆ డ్యాన్స్ చూస్తూంటే ఆ డ్యాన్స్ కనుగుణంగా... లయబద్ధంగా డ్రమ్ము వాయించాలన్పిస్తోంది ! నువ్వేమీ అనుకోకపోతే బ్రదర్.. ఓ పావుగంట పాటు నీ బొజ్జ అరువివ్వు!

సోమూ : అరెరే... నెమిలి డాన్స్ అయిపోయిందే ! ఛ-వెధవ ! (సతీష్‌ని చూస్తూ) నేనసలే పొట్టివాణ్ణి ! గున్నేనుగులా నా ముందు నించున్నావ్! నీ బొజ్జ అడ్డం వచ్చి నేను డాన్సే చూళ్ళేకపోయా ! వన్స్‌మోర్ ! ఏయ్ పిల్లా ! వన్స్‌మోర్ !

మదన్ : (వాచీ చూసుకుంటూ) ఒరేయ్.... నెమిలి డాన్స్ అయిపోయి పావుగంటయింది! ఇంకో ఐటమ్ జాడేలేదు ! చూడబోతే వీళ్ళు ప్రోగ్రాం ఇప్పుడు సెట్ చేసుకుంటున్నారో ఏమోరా ?

రాజూ : అంతే అయివుంటుంది !

(తెర వెనుక నుండి: "ఇప్పుడు జానపద నృత్యం")

సోమూ : ఈ అమ్మాయి ఇందాక క్లాసికల్ డాన్స్‌లో వుందీ! మళ్ళీ ఈ ఫోక్‌డాన్స్‌లో దూరిందీ!

వెంకట్ : బహుశః ప్రిన్సిపాల్ కూతురై వుంటుంది!

మదన్ : అంతే అంతే ! లేకపోతే ఒక్క పిల్లకే రెండు ఛాన్స్‌లేమిటీ ?

రాజూ : ఒరేయ్ 'బుగ్గే కంది పోయిందిలే' - ఈ పాట ఎవరు పాడుతున్నారో గానీ పాటకీ - డాన్స్‌కీ బొత్తిగా సంబంధం లేదురా -

సోమూ : అయ్యో ఖర్మ ! ఒక్క పాటకీ - డాన్స్‌కీ ఏమిటీ? మ్యూజిక్కీ, స్టెప్స్‌కీ అసలే సంబంధం లేదు!

వెంకట్ : పాడ్తోంది ఎవరోగానీ కీచుగొంతు పెట్టుకుని మహాధైర్యంగా పాడ్తోందిరా !

మదన్ : పాట సంగతి అలా పోనిండీ గానీ - ఆ పాపకి పాపం కొప్పూడి పోతోందిరా ! కొప్పూడిపోతోంది!

రాజూ : అసలు ఇప్పుడు బుగ్గే కందిపోయింది లే అని పాడేకన్నా కొప్పే ఊడిపోయిందిలే అని పాడ్తే బావుండేది కదరా !

(అందరూ నవ్వుతారు, తెర వెనుకనుండి మళ్ళీ అనౌన్స్‌మెంట్: "ఇహ కొద్ది క్షణాల్లో గ్రూప్ డాన్స్")

రాజూ : బాప్ రే - ఈ గ్రూప్ డాన్స్ - డాన్సా ? డ్రిల్లా?

సోమూ : కరెక్ట్‌గా చెప్పావు రాజూ ! దీన్ని నేర్పింది డ్రిల్ టీచర్ సునంద ! ఈ బోడి డాన్స్ చూడటానికి మా అక్కయ్యని బొట్టుపెట్టి మరీ పిలిచింది!

(మళ్ళీ అనౌన్స్‌మెంట్: "ఇప్పుడు లాస్ట్ ఐటమ్ 'స్కూల్‌డే'! తెలుగు నాటిక !")

మదన్ : అరేయ్ - ఈ నాటికలో హీరో వేషం వేసిన లలితని చూశావ్ కదా ! ఆమె వేసుకున్న ఆ చారల షర్ట్ ఎవర్దనుకున్నావ్ ? నాదిరా - నాది!

రాజూ : కొయ్ రా కొయ్ ! నీ డ్రెస్సులేమిటో నాకు తెలీదా - నువ్వు చెప్పగానే నమ్మడానికి ?

మదన్ : నిజం రా ! అది నాదే ! లలిత అడిగిందని - ఆమెకోసం ఒకటి కొత్తది కొని కుట్టించేశాను!

రాజూ : (అనుమానంగా) మొన్న అయిదు రూపాయలు అవసరానికి అడిగితే లేదన్నావ్? కొత్త డ్రెస్ కుట్టించడానికి డబ్బెక్కడిదిరా ?

మదన్ : లలిత అడగడం - నేను కాదనడమేమిటని టెక్స్ట్‌బుక్స్ అమ్మేశాన్రా!

వెంకట్ : ఎంతయినా నువ్వు త్యాగశీలివి గురూ ! గత సంవత్సరం గర్ల్స్ స్కూల్లో చదివే గిరిజ వాళ్ళ స్కూల్ డే కొరకు నన్ను అడిగిందని- మా అక్కయ్య పాత పట్టుచీర తీసికెళ్ళి ఇచ్చాను ! ఇక అంతే! ఆ తర్వాత ఆమె మళ్ళీ కన్పిస్తే ఒట్టు!

సోమూ : నేనూ అంతేరా ! ఒకసారి మా పక్కింటి మీనాక్షి పట్టుచీర అడిగిందని మా అమ్మ వొద్దంటున్నా విన్పించుకోకుండా నేనూ ఇచ్చాను ! దానికి ఎన్ని రంగులు పూశారో తెలుసా ? అది అసలే తన పెళ్ళిచీరని మా అమ్మ ఎన్ని చిందులు తొక్కిందో ? ఇక నీ షర్ట్ కూడా.... గోవిందో...

వెంకట్,రాజూ: గోవిందా !

మదన్ : నోర్మూయ్యండిరా ! అదిగో - ఆ తెలుగు నాటికలో హీరోయిన్ చూడండిరా - చప్పిడి ముక్కూ - పీచు జుట్టూ !

రాజూ : ఏంట్రా ? ఏం కూశావ్ ? ఆమె ఎవరనుకున్నావ్ రా ! నా చెల్లెల్రా చెల్లెలు! (మదన్‌ని నాల్గు అంటించి) ఇంకోసారి మా చెల్లెల్ని ఏమన్నా అన్నావో - ఎముకలు విరిచేస్తాను జాగ్రత్త!

వినోద్ : (ప్రవేశిస్తూ) ఇంతసేపు అందరికీ వంకలు బెట్టావ్ ? ఇప్పుడు నీ చెల్లెల్ని అంటే నీకంత పౌరుషం దేనికీ ? మిగతా ఆడపిల్లలు నీ

చెల్లెల్లాంటి వాళ్ళుకారా ? అరగంట నుండీ మీ కామెంట్స్ వినలేక ఛస్తున్నాను ! ఒక్కటైనా మమ్మల్ని సరిగ్గా చూడనిచ్చారా ?

(వినోద్‌ని చూసి మిగతా వాళ్ళు తోకముడుస్తారు ! వినోద్ దెబ్బలకి తట్టుకోలేక రాజూ కుయ్యో మొర్రో అంటూ వుండగా... తెర)

**-ఆంధ్రభూమి మంత్లీ - 1989**

**అంకితం**



**శ్రీమతి యన్. మధు**
కరీంనగర్.

టీచర్ల ఇంటర్వ్యూల సమయంలో కేరళ దాకా తోడైవస్తూ - విజయ్ విద్యా సంస్థల పట్ల తన ఉడుతాభక్తిని చాటుకుంటోన్న ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్: **శ్రీమతి యన్. మధు** కి...

ప్రేమతో....